సాక్షి
సిద్దిపేట
గురువారం । 1 । జూన్ । 2023



పంటమార్పిడితోనే భూసార వృద్ధి
ఒకేరకమైన పంట సాగుతో పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల ఉండదు. అందుకే పంట మార్పిడి తప్పనిసరి అని వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు. 8లో



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు
రామునిబండ ఆలయంలో బుధవారం కోదండ రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఏర్పాటు వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. 9లో

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్
సిద్దిపేటకమాన్: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. జూన్ 8వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని, ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మూడు నుంచి బడిబాట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జూన్ 3వ తేదీ నుంచి 17 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జూన్ 1న బడి పాట, గ్రామ సభ, జూన్ 3 నుంచి 9 వరకు ప్రత్యేక డ్రైవ్, జూన్ 12న పాఠశాల అలంకరణ, పునప్రారంభం, 13న తొలిమెట్టు ప్రాధాన్యతపై అవగాహన, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న వికలాంగ పిల్లల చేరికలు, 16న ఇంగ్లిష్ మీడియంపై అవగాహన, 17న ప్రభుత్వ విద్యపై బాలికలతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ జాతర సందర్భంగా బుధవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో వందేళ్ల అభివృద్ధి జరుగుతుందని చెబుతున్న వారు.. దశాబ్ద కాలంలో వందేళ్లు బతికేంత ఆస్తులు సంపాదించుకున్నారే తప్ప తెలంగాణ అభివృద్ధి జరగలేదన్నారు. ఎంపీ బండి సంజయ్‌కి, తన కంటే ముందు ఐదు సంవత్సరాలు ఎంపీగా పనిచేసిన వినోద్‌కుమార్‌కు ఎల్లమ్మ దేవత సాక్షిగా సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 4 సంవత్సరాల కాలంలో ఇక్కడి ప్రజలకు ఏం న్యాయం చేశారో... ఏం అభివృద్ధి జరిగిందో ఎల్లమ్మ దేవత సాక్షిగా బహిరంగ చర్చకు రావాలని ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్నసది, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పూదరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట టు జేబీఎస్ నాన్‌స్టాప్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట నుంచి జేబీఎస్‌కు నాన్‌స్టాప్ డీలక్స్ బస్సు సేవలు అందుబాటులోకి రానున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 7 డీలక్స్ బస్సులను నేడు గురువారం మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త సర్వీస్‌లతో సిద్దిపేట నుంచి జేబీఎస్‌కు 30 నిమిషాల ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ సిద్దిపేట లక్ష్యం

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



ర్యాలీ ప్రారంభిస్తున్న మంజుల

సిద్దిపేటజోన్: క్లీన్ అండ్ గ్రీన్ సిద్దిపేట లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్స్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షెహర్‌లో భాగంగా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో ప్రజలు సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆరుబయట చెత్త వేయరాదని, ఇంటింటా మొక్కలు నాటాలని, కాలుష్య నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు తిరుమల్ ఆనంద్, సుందర్, యోగి, శ్రీహరి, మల్లికార్జున్, రాజు, తదితరులుపాల్గొన్నారు.

దళితబంధు అమలు చేయాలి

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాలపై ఉన్న శ్రద్ధ దళితబంధు, ధాన్యం కొనుగోళ్లు, డబుల్ బెడ్రూం పథకాల అమలుపై లేదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మండిపడ్డారు. బుధవారం రాయపోల్ మండల పరిధిలోని కృష్ణ సాగర్ గ్రామంలో దళిత కుటుంబాల పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా నిలిపివేసిన దళితబంధు పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ గోండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేనా?

- 'మన బడి' కింద రూ.126 కోట్లు మంజూరు
- జిల్లాలో 343 పాఠశాలల్లో పనులు
- వంద శాతం పూర్తయినవి 45 స్కూళ్లు మాత్రమే



పక్కన ఫొటో దుబ్బాక పట్టణం హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్త భవనం. 60 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ స్కూల్‌లో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. స్లాబ్ మాత్రమే పూర్తయింది. మేజర్ మైనర్ మరమ్మతులు, మూత్రశాలలు, ప్రహరీ, కిచెన్ షెడ్ ఇంకా పూర్తి కాలేదు.

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం గతేడాది ఏప్రిల్‌లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాలో 343 పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి రూ.126 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 45 పాఠశాలలో మాత్రమే వంద శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఓ వైపు అధికారులు మే 31వ వరకు పనులు చేయాలని ఆదేశాలు జారీ చేయగా, చాలా చోట్ల పనులు కొనసాగుతున్నాయి. పాఠశాల పునప్రారంభానికి మరో 12 రోజులు మాత్రమే ఉండడంతో గడువులోగా పనులు పూర్తయ్యే అవకాశం కనబడడంలేదు.

- జిల్లాలో తొలి విడతలో మనబడి ద్వారా రూ.86 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.40కోట్లు కేటాయించారు.
- మౌలిక వసతుల కల్పన కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌కు సిద్దిపేట, దుబ్బాక, జనగామ (చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలు)ఈడబ్ల్యూఐడీసీకు గజ్వేల్, ఆర్అండ్‌బీ కి హుస్నాబాద్, మానకొండూరు (బెజ్జంకి)లకు బాధ్యతలు అప్పగించారు.
- కాగా 343 పాఠశాలలకు గాను కేవలం 45 స్కూళ్లలో మాత్రమే వంద శాతం పనులు పూర్తయ్యాయి.

వివిధ దశల్లో ఉన్న పనుల వివరాలు:

	1	2	3	4	5	6	7	8
ప్రారంభం కానివి	85	14	50	20	18	44	83	47
జరుగుతున్నవి	98	70	148	50	70	158	66	93
పూర్తి అయినవి	79	246	137	26	26	41	43	37

1.తాగునీటి సరఫరా 2. విద్యుత్ 3.మేజర్, మైనర్ మరమ్మతులు 4.అదనపు గదులు 5.డైనింగ్ హాల్ 6.మూత్రశాలలు, మరుగుదొడ్లు 7.ప్రహరీ 8.కిచెన్ షెడ్‌లు



గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవ్‌పూర్ పీర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 104 మంది విద్యార్థులున్నారు. మూడు అదనపు గదుల నిర్మాణం పూర్తి కాలేదు. తాగునీటి సౌకర్యం, మరమ్మతులు పనులు 33శాతం, మూత్రశాలలు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. కిచెన్ షెడ్ బేస్‌మెంట్ లెవల్ వరకు జరిగాయి.



హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామలో ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి 167 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదనంగా రెండు గదులను నిర్మిస్తున్నారు. పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలో ఉంది.

సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 190 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్‌లను నిర్మించాలని నిర్ణయించారు. కిచెన్ షెడ్ రెంటల్ లెవల్ వరకు, తరగతి గదులు స్లాబ్ వరకు పూర్తవగా, గోడల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.



త్వరగా పూర్తయ్యేలా చూస్తాం



మన బడిలో భాగంగా జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వందశాతం పూర్తవగా, మరికొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. పెండింగ్ పనులపై సమీక్షించి త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. - శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ



డీఆర్‌సీసీ ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

ప్రమాదమా.. ఎవరైనా చేశారా?

- అగ్నిప్రమాదంపై అనుమానాలు
- సుమారుగా రూ.30లక్షల ఆస్తి నష్టం
- డీఆర్‌సీసీలో కనబడని ఫైర్ సెఫ్టీ

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ) జరిగిన అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే చర్చ సాగుతోంది. పట్టణంలోని హౌసింగ్ బోర్డుకాలనీ డీఆర్‌సీసీలో మే 27న అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక ఎవరైనా సిగరేట్, బీడీ తాగి పడేస్తే జరిగిందా.. అని చర్చ జరుగుతోంది.

30లక్షల ఆస్తి నష్టం

- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతిరోజు వెలువడే తడి, పొడి చెత్తను పారిశుధ్య సిబ్బంది వేర్వేరుగా సేకరిస్తుంటారు.
- తడి చెత్తను బుస్సాపూర్ యార్డుకు తరలించి ఎరువు, గ్యాస్‌గా తయారు చేస్తున్నారు.
- మంగళ, శుక్ర వారాల్లో సేకరించిన పొడి చెత్తను హౌసింగ్ బోర్డుకాలనీలో డీఆర్‌సీసీకి తరలిస్తారు.
- ఈ సెంటర్ నిర్వహణను ఓ సంస్థకు అప్పగించి, 32 రకాలుగా చెత్తను విభజించి విక్రయిస్తున్నారు.
- మే 27న అగ్నిప్రమాదంలో ఒక డీసీఎం, లోడర్, రెండు బెలింగ్ మిషన్‌లు, 2 ల్యాప్‌టాప్‌లు, వేయింగ్ స్కేల్, కన్వెయర్ బెల్ట్, రూ.10లక్షల విలువ చేసే ప్లాస్టిక్, ఇతర మెటీరియల్ పూర్తిగా దగ్ధమయ్యాయి.
- ఈ ప్రమాదంలో సుమారుగా రూ.30లక్షల నష్టం జరిగింది.
- స్థానికులు, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.
- డీసీఎం నుంచి వచ్చే నిప్పులతో ప్రమాదం జరిగి ఉండవచ్చని చెబుతున్నా.. అలా అయితే అంతపెద్ద ప్రమాదం జరగదని, అందులో పని చేసే కార్మికులు ఎవరైనా సిగరేట్, బీడి తాగి పడేస్తే జరిగి ఉండవచ్చని చర్చించుకుంటున్నారు.

నిబంధనలు గాలికి..

డీఆర్‌సీసీలో ఫైర్ సెఫ్టీ నిబంధనలు పాటించినట్టు తెలియడంలేదు. నాలుగు ఎక్సింగ్ విషర్ మాత్రమే ఉండగా, కనీసం వాటిని ఎలా వినియోగించాలో తెలియక సిబ్బంది వాటి వైపు చూడలేదు. స్క్రాబ్ గోదాంగా డీఆర్‌సీసీని పరిగణిస్తారు. ఇలాంటి చోట ఫైర్ సెఫ్టీ నిబంధనల ప్రకారం తప్పకుండా ఒక వాటర్ ట్యాంకర్, పోర్టబుల్ పంప్, ఎక్సింగ్‌విషర్‌లు ఉండాలి. అందులో పని చేసే సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు స్పందించాల్సి అంశాలపై అవగాహన కల్పించాలి. ఇలాంటివేవి డీఆర్‌సీసీలో కనబడడంలేదనే ఆరోపణ లున్నాయి.

స్పార్క్‌తోనే మంటలు

డీసీఎంలో వచ్చిన స్పార్క్‌తో ప్లాస్టిక్ కవర్‌లు అంటుకున్నాయి. దీంతో ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. మున్సిపాలిటీకి ఎలాంటి నష్టం జరగలేదు. నిర్వహణ బాధ్యత ప్రవేట్ సంస్థ చూస్తోంది. ప్రమాద కారణాలపై విచారణ చేస్తాం. - సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న దశాబ్ది వేడుకల ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. మైదానంలో స్టేజీ, ఫ్లెక్సీ, వీఐపీ కారిడార్, అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకలను వీక్షించేలా గ్యాలరీలను నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. మైదానంలో తాగునీటి వసతి కల్పించాలని తహసీల్దార్ విజయ్ సాగర్‌కి సూచించారు. రంగధాంపల్లి అమరవీరుల స్థూపానికి రంగులు వేసి పూలతో అందంగా ముస్తాబు చేయాలని కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఆదేశించారు. బందోబస్తు, కార్ పార్కింగ్ ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌కు అప్పగించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

చేర్యాల(సిద్దిపేట): నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు విక్రయిసే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేర్యాల రైతు వేదికలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు విత్తన డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ రాధిక, మున్సిపల్ చైర్మన్ స్వరూపరాణి, జిల్లా రైతుబంధు సమన్వయ సమితి సభ్యులు శ్రీధర్ రెడ్డి, ఏవోలు అఫ్రోజ్, నరేష్, రామకృష్ణ, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని వసతి గృహాల్లో ఖాళీలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లేశం తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9000019730 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మహిళామోర్చాను పటిష్టం చేస్తాం



మాట్లాడుతున్న లక్కిరెడ్డి తిరుమల

హుస్నాబాద్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే 6 నెలల కార్యాచరణను విజయవంతం చేయాలని జాతీయ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల పిలుపునిచ్చారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపెల్లి అరుణ రెడ్డి ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా మోర్చా విభాగాన్ని పటిష్టపరిచేందుకు 6 నెలల కార్యాచరణ రూపొందించామని, ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, ఉపాధ్యక్షురాలు అనురాధ, లక్ష్మి, విజయ, పట్టణ అధ్యక్షురాలు దీపిక, సిద్దిపేట పట్టణ అధ్యక్షురాలు ఇంద్రాణి, దివ్య, మాధవి, శ్వేత, అంజలి, అనూష, రజిత, తిరుమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మె తాత్కాలిక వాయిదా



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు రమ

సిద్దిపేటఅర్బన్: గత 44 రోజులుగా వీఓఏలు చేస్తున్న సమ్మెను మంత్రి హామీతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు సీఐటీయూ అనుబంధ వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు రమ తెలిపారు. బుధవారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వీఓఏల సమస్యలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సానుకూలంగా స్పందించారని, సీఈఓతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, సహాయ కార్యదర్శి రవికుమార్, ఐకేపీ వీఓఏ యూనియన్ జిల్లా నాయకులు కిష్టయ్య, రాజు, కనకయ్య, భవాని, లత, షౌకత్, మహేష్, మమత, విజయ్‌కుమార్, లావణ్య, నిఖిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది కాలంలో.. శతాబ్ది అభివృద్ధి

- సమష్టిగా వేడుకలు నిర్వహిద్దాం
- నాడు, నేడు తేడాను వివరిద్దాం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, సిద్దిపేట: దశాబ్ది కాలంలోనే శతాబ్ది కాలంలో జరిగే అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపించారని, తెలంగాణ వస్తే చీకటి అవుతుందన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కిరణ్ చీకట్లో మగ్గుతుంటే.. తెలంగాణ వెలిగిపోతుందని అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆనాడు కర్ర పట్టుకొని తెలంగాణ ఏర్పడితే ఏం జరుగుతుందో చెప్పారని, ఇప్పుడు రాష్ట్రం ఎలా ఉందో ప్రజలు గమనించాలని అన్నారు. దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులున్నారని, ఏ రాష్ట్రంలో బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ ఇవ్వడం లేదని, కేవలం మన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇస్తున్నారన్నారు.

రోజుకో తీరులో..

ఉత్సవాల్లో భాగంగా జూన్ 9న విశ్వకర్మ, వడ్డెర, మేదర చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, 13న గృహలక్ష్మీ పథకం, 14న న్యూట్రిషన్ కిట్, 22న అమరవీరుల స్మారక స్థూపం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 70శాతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీలు అయితే ప్రస్తుతం 70శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు అవుతున్నాయన్నారు. శిశుమరణాల రేటును తగ్గించి మొదటి మూడు స్థానాల్లో తెలంగాణ నిలిచిందన్నారు.

ప్రగతి ఉట్టిపడేలా ఉత్సవాలు

సిద్దిపేటజోన్: స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతిని ప్రజలకు చాటిచెప్పేలా.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం విపంచి ఆడిటోరియంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన నియోజకవర్గస్థాయి దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతీ పల్లె, పట్టణంలో పండగ వాతావరణంలో జరపాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ దశాబ్ద కాలంలో శతాబ్ది అభివృద్ధి సాధించామని, నాడు ఉద్యమంలో సిద్దిపేట ముందు ఉందని, నేడు ప్రగతిలో ముందుండి అభివృద్ధికి అధ్యయన కేంద్రంగా మారిందన్నారు.

ముందస్తు సాగుపై అవగాహన కల్పించాలి

ఉత్సవాల్లో భాగంగా ప్రతీ గ్రామంలో రైతువేదిక వద్ద ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. అకాల వర్షాలతో పంటలకు నష్టం జరగకుండా ఉండేందుకు పంట కాలాన్ని నెలరోజులు ముందుకు తీసుకువెల్దామని, దీనిపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఆటోనగర్‌లో 500మందికి కేటాయించిన స్థలాలను కేటాయిస్తామని అన్నారు. రంగనాయకసాగర్ వద్ద సంబురాలు చేయాలని, ప్రతీ చెరువు వద్ద బతుకమ్మ, బోనాలు, చేపల వలతో సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. సాహిత్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులు, సాహితీవేత్తలతో ఓ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. తొలుత తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి నివాళ్లు అర్పించి సంబరాలు ప్రారంభించాలన్నారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల ఉద్దేశ, విధివిధానాలపై వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మహేందర్, ఆర్డీఓ మున్సిపల్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత, పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, జెడ్పీసీలు, ఎంపీపీలు, ఆత్మ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, పాల్గొన్నారు

క్లుప్తంగా

పరువు నష్టం కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): కాల్వ తవ్వకం పనుల విషయంపై ఓ కంపెనీ ఉద్యోగి మాచర్ల సంపత్ కుమార్‌పై పరువునష్టం కేసు నమోదు చేశామని కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి కాల్వ ద్వారా నీరు వెళ్లేందుకు కోనాయిపల్లి, మంగోల్, మాత్‌పల్లి, మేదినీపూర్, లకుడారం, తపాస్‌పల్లి గ్రామాల్లోని రైతులు పట్టా భూములు కోల్పోతున్నారు. టెండర్ ద్వారా కాల్వ పనులు దక్కించుకున్న సాయిదత్త కంపెనీ నిర్వాహకులు 2022 డిసెంబర్‌లో పరిహారం విషయమై రెవెన్యూ అధికారులతో లకుడారంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. రైతులకు నష్ట పరిహారం అందించాకే కాల్వ తవ్వకం పనులు చేయాలంటూ వైస్ ఎంపీపీ దేవి రవీందర్ గ్రామ సభలో రైతుల పక్షాన మాట్లాడారు. అయితే సాయిదత్త కంపెనీ ఉద్యోగి సంపత్ కుమార్ ఈ పనుల విషయమై గొడవలు జరగకుండా దేవి రవీందర్‌కు కొంత డబ్బు ముట్టజెప్పామంటూ బాధిత రైతుల్లో ఒకరికి చెప్పి అప్రతిష్ట పాలు చేశారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న దేవి రవీందర్ తనను అప్రతిష్ట పాలు చేస్తున్నారనే నెపంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇల్లు కూల్చిన ఘటనలో..

నంగునూరు(సిద్దిపేట): ఇంటిని కూల్చివేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన రంగు మల్లవ్వ ఉపాధి కోసం కొన్ని సంవత్సరాల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఈ క్రమంలో తన ఇల్లు కూలిపోయే స్థితిలో ఉండడంతో తిరిగి వెంకటాపూరానికి వచ్చి ఇంటిని మరమ్మతు చేయిస్తోంది. అయితే గ్రామానికి చెందిన రేకులపల్లి కోటిరెడ్డి, రేకులపల్లి భాస్కర్‌రెడ్డి, పులిగిల్ల చంద్రయ్య, బొమ్మిడి కరుణాకర్‌రెడ్డి డ్రోజర్ ట్రాక్టర్‌తో తన ఇంటిని కూల్చివేశారని మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత


మృతి చెందిన గేదె వద్ద బాధిత కుటుంబసభ్యులు

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటపూర్ కిషన్ నాయక్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండాకు చెందిన మూడ్ రమేష్ ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలం వద్ద పశువులను మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెకు కరెంట్ తీగలు తగిలాయి. దీంతో గేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు రమేష్ కోరాడు.

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

నారాయణఖేడ్: పట్టణంలోని రాంవిలాస్ వీధిలో మంగళవారం రాత్రి హైఓల్టేజీ కారణంగా పలు ఇళ్లల్లో గృహోపకరణాలు, విద్యుత్ ఉపకరణాలతో పాటు ఓ కొరియర్ సంస్థలో ప్రింటర్, తదితర పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. హైఓల్టేజీ కారణమని గుర్తించి చాలా ఇళ్లల్లో అప్పటికప్పుడు గృహోపకరణాల స్విచ్‌లు ఆఫ్ చేశారు.

పంటమార్పిడితోనే భూసార వృద్ధి

- రోగకారక పురుగుల జీవితచక్రం ఛేదన
- చీడపీడల అభివృద్ధికి అడ్డుకట్ట


పొలం దున్నుతున్న రైతు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఒకేరకమైన పంట సాగువల్ల పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల ఉండదు. అంతేకాకుండా ఎక్కువగా ఆ పంట రోగాలను బారిన పడుతుంది. అందుకే పంటమార్పిడి తప్పనిసరి అని వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు.

పంట మార్పిడి ప్రాధాన్యం:

- ఒక పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
- పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం ఛేదించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక పంటపై ఆశించడం సాధారణంగా జరగదు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంటమార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక లక్షణాలు స్వభావం దెబ్బతినకుండా ఉండడానికి చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంటమార్పిడి చేయాలి
- అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

పంట మార్పిడి ప్రయోజనాలు:

- వరి తర్వాత మినుము, పెసర, శనగ, వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్ నివారించవచ్చు.
- చెరకు తర్వాత వరి సాగు చేయడం వల్ల వేరు పురుగు, దోమ పోటు నివారించవచ్చు.
- పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, మినుము, వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగుల బెడద ఉండదు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వరి సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పుధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, పొగాకు వంగ పైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగ పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

తెగుళ్లకు అడ్డుకట్ట



రైతులు ఎల్లప్పుడు ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువై దిగుబడులు తగ్గిపోతాయి. అంతే కాకుండా రోగకారక పురుగుల జీవితచక్రం ముగించుకుని రోగాల ఉధృతి పెరుగుతుంది. రైతులు అందుకే వరుసగా ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తుండాలి. తద్వారా దిగుబడులు పెరిగి మంచి లాభాలను పొందవచ్చు.

– వసంతరావు, జగదేవ్‌పూర్ ఏఓ

కామన్వెల్త్, ఒలింపిక్స్‌లో రాణించాలి


బాస్కెట్‌బాల్ విన్నర్స్ జట్లతో డాక్టర్ ఆంజనేయులుగౌడ్

శాట్స్ ఛైర్మన్ ఆంజనేయులుగౌడ్

వెంగళరావునగర్: రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులందరూ భవిష్యత్‌లో కామన్వెల్త్, ఒలింపిక్స్ క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా స్టేట్ (శాట్స్) ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన చీఫ్ మినిస్టర్ కప్–2023 పోటీల్లో వేలాది మంది వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులతో పాటుగా తమ ప్రతిభను చాటుతూ ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో వచ్చిన వారు సైతం మరింతగా శిక్షణ తీసుకుని భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. యువత తమకు నచ్చిన క్రీడల్లో ట్రైనింగ్ తీసుకుంటే రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురాగలుగుతారన్నారు. అనంతరం ఫైనల్స్‌లో విజయం సాధించిన హైదరాబాద్ మెన్స్ అండ్ ఉమెన్స్ జట్లకు ఆయన ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డీఆర్‌డీఓ ప్రభాకర్, సంగారెడ్డి డిప్యూటీ ఎస్‌ఓ రామచందర్, స్టేడియం ఇన్‌చార్జి జి.రవీందర్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, జీహెచ్‌ఎంసీ, టూరిజం తదితర శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం


జ్యోతి, పండరి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన అశోక్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అశోక్ డ్యూటీకి వెళ్లే సమయంలో భార్య జ్యోతి, రెండున్నర సంవత్సరాల కుమారుడు పండరి ఇద్దరు ఇంట్లో ఉన్నారు. తిరిగి రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో భార్య, కుమారుడు కనిపించలేదు. భార్య నంబరుకు ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన తిరుపతికి గత నెల18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపాడు. క్యాంటీన్‌లో తక్కువ ధరకు ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులో ఉన్నాయని నమ్మబలికాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మి బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.45వేలు పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేశారు. హైదారబాద్‌లోని చందానగర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటునట్లు గుర్తించారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగపూర్ గ్రామానికి చెందిన తుడుం లక్ష్మణ్ (22)ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో భాగంగా నిందితుడు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో షాద్‌నగర్, యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతి


రబిసింగ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన రబిసింగ్ (23) రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రబీసింగ్ పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

దుబ్బాకటౌన్: పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో షాదీఖానా వద్ద బుధవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఎల్లప్ప, ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దుస్తుల వ్యాపారి ఇంగు నాగభూషణం (55) రిజిస్ట్రేషన్ ఆఫీసుకు పని నిమిత్తం వెళుతున్నాడు. పెద్దగుండవెల్లికి చెందిన దేవిరెడ్డి దుబ్బాకకు వస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ వారిని 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో గాయపడ్డ దేవిరెడ్డి

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగ్వార్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతిఒక్కరూ బీఆర్‌ఎస్ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మెటల్‌కుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు, సీనియర్ న్యాయవాది పాండురంగారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారుల పనులు ప్రారంభం

ఝరాసంగం (జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి గ్రామం నుంచి జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామం వరకు నిర్మించే రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు ఓం ప్రకాష్‌పాటిల్, జగదీశ్వర్, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


బీఆర్‌టీయూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ముద్రించిన పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీష్‌రావు గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడలో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళితబంధు అందని ఆటో డ్రైవర్లకు గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షల అందిస్తామని, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. 4 వేల మంది ఆటో కార్మికులకు డ్రెస్సులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు సాయిబాబా, ఫరీద్, నరసింహగౌడ్, శ్రీనివాస్, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కింద ఇరుక్కున్న ధాన్యం లారీ


అల్లాదుర్గం వద్ద 161 రహదారి బ్రిడ్జి కింద ఇరుక్కున్న ధాన్యం లారీ

అల్లాదుర్గం(మెదక్): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించి చిన్న బ్రిడ్జితో అందరూ అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి అన్ని కార్యాలయాలకు ఈ బ్రిడ్జి కిందనే వెళతారు. బుధవారం అల్లాదుర్గం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ బ్రిడ్జి కింద ఇరుక్కుని బస్తాలు కిందపడ్డాయి. గతంలోనూ ఓ ట్రాక్కు సైతం ఇలాగే ఇరుక్కొని తీవ్ర అంతరాయం కలిగింది.

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

యువకుడి కడుపులోంచి 2.5 కిలోల కొవ్వు తొలగింపు


వైద్యులు తొలగించిన 2.5 కిలోల కొవ్వు

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో వైద్యులు ఓ యువకుడి కడుపు నుంచి 2.5 కిలోల కొవ్వును తొలగించారు. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన పుట్ట వెంకటేష్ రెండేళ్లుగా కడుపునొప్పితో భాదపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. ఇటీవల అతడిని పరీక్షించిన దుబ్బాక ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి కడుపులో హెర్నియా తరహాలో కొవ్వు పెరిగిపోయినట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేసి కొవ్వును తొలగించి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం వెంకటేష్ ఆరోగ్యం నిలకడగా ఉందని హేమరాజ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యబృందానికి వెంకటేష్ కుటుబం కృతజ్ఞతలు తెలిపారు.


ఆపరేషన్‌లో పాల్గొన్న దుబ్బాక ఆస్పత్రి వైద్యబృందం

తన తల్లితో అసభ్యంగా ప్రవర్తించాడని...


సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటేశం తదితరులు

వ్యక్తిని హతమార్చిన కొడుకు

ఝరాసంగం(జహీరాబాద్): తన తల్లి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని కుమారుడు హత్య చేశాడు. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని జునేగావ్ గ్రామానికి చెందిన ఎల్లయ్య(50) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళ పట్ల ఎల్లయ్య సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన ఆ మహిళ బావ కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. మంగళవారం రాత్రి ఎల్లయ్య తన ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో ఆ మహిళ కుమారుడు బి.రమేష్, దుర్గాప్రసాద్‌తో కలిసి కర్రలతో తలపై కాళ్లపై బలంగా కొట్టారు. మృతుడి తలపై బలమైన గాయం కావడంతో ఒక్కసారిగా అరవడంతో గమనించిన కుటుంబ సభ్యులు జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు చెప్పాడు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ ఎన్.వెంకటేశం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

దుబ్బాకరూరల్: వెంకటగిరి తండాలో ఎంపీపీ కొత్త పుష్పలత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లోకి వెళ్లి ఖర్చుల బారిన పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా కళ్లద్దాలు, మెడిసిన్ ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, సర్పంచ్ పెంటవ్వబాలకిషన్, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, ఎంఎంసీ చైర్‌పర్సన్ జ్యోతి, మెడికల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

మెదక్ జిల్లాలో గాయపడిన ఒకరు, ఆత్మహత్యకు యత్నించిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.


లక్ష్మణ్(ఫైల్)

పాపన్నపేట (మెదక్): చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని డాక్యతండాకు చెందిన మునోత్ లక్ష్మణ్ (27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబసభ్యుల పెళ్లిళ్లకు అప్పులు అయ్యాయి. అవి తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులతో తరచు ఇంట్లో బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో మే 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తండా శివారులోని అటవీ ప్రాంతంలో పురుగు మందు సేవించి అక్కడే పడి ఉన్నాడు. బుధవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు చేరిన మృతుల సంఖ్య


వెలమకన్నె కృష్ణ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చెందాడు. నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన వెలమకన్నె కృష్ణ (38) మే 25న నర్సాపూర్ నుంచి సంగారెడ్డి దారిలో ఉన్న రైస్‌మిల్‌కు ధాన్యం అమ్మేందుకు అడుగుదామని బుసగల్ల శ్రీనివాస్‌తో కలిసి బైకుపై వెళ్తుండగా ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బుసగల్ల శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెలమకన్నె కృష్ణకు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, పిల్లలు కిరణ్, అపూర్వ ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో సీతారాంపూర్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి.